క్లుప్తంగా

నేటితో ముగియనున్న గడువు

దత్తిరాజేరు: అర్హత ఉండి అన్నదాత సుఖీభవ పథకం అందని వారు బుధవారం రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేయించుకోవాలని ఏవో అనురాధ తెలిపారు. కొత్తగా పథకం పొందాలన్నా గతంలో వివిధ కారణాలతో జాబితాలో పేర్లు రాని వారు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏలకు వన్ బీ, ఆధార్ కార్డ్ జెరాక్స్‌లను అందజేయాలని సూచించారు. వారు లాగిన్‌లో పేర్లు నమోదు చేస్తారని అర్హత ఉన్న వారు వినియోగించుకోవాలని కోరారు.

అర్జీలను అందజేయండి

మెరకముడిదాం: దివ్యాంగుల పింఛన్ల అప్పీల్ ప్రక్రియకు అనర్హులుగా నోటీసు అందుకున్న వారు తాము అర్హులమని భావించినట్టయితే లబ్ధిదారులు తమ అర్జీలను ఎంపీడీవో కార్యాలయానికి అందజేయాలని ఎంపీడీవో గొర్లె భాస్కరరావు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. లబ్ధిదారులు అందజేసిన అర్జీలను పింఛన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. లబ్ధిదారులు స్పందించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు మండల సమావేశం

లక్కవరపుకోట : మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరుగుతుందని, సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

వేపాడ: మండల కేంద్రంలోని శ్మశాన స్థలం ఆక్రమణకు గురవుతున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదంటూ గ్రామానికి చెందిన గొర్లె శ్రీనివాస్ తదితరులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. మంచినీటి కోనేరును ఆనుకుని ఉన్న శ్మశానంలో 12 సామాజిక వర్గాలకు చెందిన వారు ఎవరూ చనిపోయినా.. ఇక్కడే దహన సంస్కారాలు జరుగుతాయని తెలిపారు. ఇప్పుడు శ్మశానం చుట్టూ షెడ్‌లు వేసి ఆక్రమణలు చేస్తున్నారని, పశువుల కోనేరు చుట్టు కూడా ఆక్రమణలు జరుగుతున్నాయని తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాధితులకు సాయం

చీపురుపల్లి రూరల్: గరివిడి మండలంలోని కొండదాడిలో ఇటీవల కురిసిన వర్షాలకు పి.గౌరమ్మ, కె.సావిత్రి ఇళ్లు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు గోవిందరాజులు నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, దుస్తులను మంగళవారం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ చందక మన్మథరావు, పి.సుధాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు

బొండపల్లి : సీపీఐ రాష్ట్ర మహాసభలు బుధవారం నుంచి ఈ నెల 25 వరకు ఒంగోలులో జరగనున్నట్టు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పురం అప్పారావు తెలిపారు. మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఎం.వెంకటరమణ, పి.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

వేపాడ: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉద్యాన పంటల్లో నీరు నిలిచి తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని కొత్తవలస ఉద్యానవన శాఖాధికారి పద్మ రైతులకు సూచించారు. మంగళవారం కుమ్మపల్లి గ్రామంలో పలు ఉద్యాన వన పంటలను పరిశీలించి పలు సూచనలు సలహాలు రైతులకు అందించారు. అరటి పంటలో నిలిచిన నీరు బయటకు పోయేలా చూడాలన్నారు. విరిగిపోయిన చెట్లను రెండు పిలకలు ఉంచి మిగిలింది కోసి వేయాలని, రెండు రోజులు నీరు నిల్వ వుండకుండా తొలగించి ఆరేలా చూడాలన్నారు.

పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలి


టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ అచ్చుతకుమారి

గంట్యాడ: ధనుర్వాతం రాకుండా పిల్లలకు వ్యాక్సిన్ వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అచ్చుతకుమారి అన్నారు. మండలంలోని తాటిపూడి గిరిజన వసతిగృహంలో మంగళవారం జరుగుతున్న ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. 15 ఏళ్లలోపు పిల్లలకు ధనుర్వాతం రాకుండా వ్యాక్సిన్ వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈవో రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కలగా మిగిలిన వంతెన నిర్మాణం!

- శాసనపల్లి – పెదవేమలి మధ్య గెడ్డపై వంతెన నిర్మాణం ఏమైనట్టు?
- తొలుత కూటమి ప్రభుత్వం హడావిడి
- తరువాత పట్టించుకోని వైనం

జామి: మండలంలోని శాసనపల్లి – పెదవేమలి మధ్య గెడ్డపై వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోయింది. ఈ వంతెన నిర్మాణం కోసం ఈ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూడడమే తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ఈ క్రమంలో గెడ్డలో నీటి ప్రవాహం ఎక్కువైనప్పుడు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి. అలాగే అత్యవసర పరిస్థితుల్లో రోగులు ప్రాణసంకటంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొద్ది రోజులు పాలకులు ఈ గెడ్డపై వంతెన నిర్మాణానికి సంబంధించి హడావిడి చేశారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు గెడ్డ కష్టాలు ట్విట్ ద్వారా ఫిర్యాదు చేశారు. తరువాత జేసీతో పాటు ఇంజినీరింగ్ అధికారులు వచ్చి హడావిడి చేశారు. గెడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. గెడ్డ కష్టాలు తొలగుతాయని ఈ ప్రాంత ప్రజలు సంబరపడ్డారు. అయితే ఏడాది దాటినా అతీగతి లేకుండా పోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు.

గెడ్డతో విద్యార్థుల కష్టాలు

శాసనపల్లి తదితర గ్రామాల నుంచి పెదవేమలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు నిత్యం విద్యార్థులు గెడ్డ దాటి నడిచి వెళ్తారు. వర్షాలు ఎక్కువగా పడినా.. తుఫాన్ సమయాల్లో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లరు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఈ ప్రాంత పిల్లలు పాఠశాలలకు వెళ్లడం లేదు. పెదవేమలి తదితర గ్రామాల నుంచి భీమసింగి జూనియర్ కళాశాలకు విద్యార్థులు వెళ్లివస్తుంటారు. ప్రస్తుతం గెడ్డలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. కళాశాల విద్యార్థులు కూడా ఇంటి వద్దే ఉంటున్నారు. దీంతో విద్యార్థుల విద్యాభ్యాసానికి గెడ్డ పెద్ద శాపంగా మారింది. ఇక్కడ గెడ్డపై వంతెన నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రతిపాదనలు పంపాం..

దీనిపై పీఆర్ జేఈ స్వామినాయుడును వివరణ కోరగా వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు మంజూరైతే పనులు చేపడతామని వెల్లడించారు.


శాసనపల్లి వద్ద గెడ్డలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు


పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితిలో గ్రామంలోనే ఉండిపోయిన విద్యార్థులు

కలగానే మిగిలింది



శాసనపల్లి గెడ్డపై వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోతుంది. ఎన్నో సంవత్సల నుంచి వంతెన నిర్మాణానికి నేతలకు, అధికారులకు ఎన్నోసార్లు విన్నవించాం. అయినా ఫలితం లేదు. వరదలు వస్తే మా గ్రామం మొత్తం గెడ్డ వలన జలదిగ్బంధం అవుతుంది. మొత్తం రాకపోకలు సాగవు.

– బి.పెంటయ్య, శాసనపల్లి

విద్యాభ్యాసానికి అడ్డంకి



గెడ్డ నీరు ఎక్కువగా వస్తుడడంతో మా గ్రామంలో పిల్లలు ఎవరు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి. ఇంటి వద్దే ఉండిపోతున్నారు. ప్రస్తుతం ఐదు రోజుల నుంచి ఇంటి వద్దే ఉంటున్నారు. విద్యార్థులు చదువులకు మా గెడ్డ శాపంగా మారింది. పాఠశాలకు వెళ్లకపోవడంతో పిల్లల చదువులకు ఇబ్బంది అవుతుంది.

– ఆర్.జగదీష్, శాసనపల్లి

ట్రాన్స్‌ఫార్మర్ మార్చారు...

సాక్షి ఎఫెక్ట్

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామం నుంచి ఎం.రావివలస గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవ్వడంతో సాక్షి దినపత్రికలో ఈ నెల 18వ తేదీన 'విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చరూ' అనే శీర్షికన వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం విద్యుత్ శాఖ ఏఈ దివాకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఈ నెల 18వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనం


కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

విద్యార్థుల నిరసన ర్యాలీ

శృంగవరపుకోట: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రోడ్డెక్కితే పోలీసులతో బెదిరింపులకు దిగడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు వి.భారతి ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ర్యాలీ చేపట్టారు. అయితే పట్టణంలో సెక్షన్ 30 అమల్లో ఉందని, అరెస్టు చేస్తామని బెదిరింపులకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నారా లోకేష్ ఎన్నికల సమయంలో వచ్చి తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఇప్పుడు మరచిపోయారని పేర్కొన్నారు. జీవో 77 రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్లు విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నేతలు ఆర్.రత్న, చరణ్, మహేష్, అనిత, నాని, శంకర్, సాయికిరణ్, కిరణ్, తిలక్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ముందస్తు జ్రాగత్తగా..

భామిని: మండలంలోని గురండి సీతా మహాలక్ష్మి చెరువు నిండుగా వరద నీరు వచ్చి చేరింది. చెరువు ఎగువ భాగంలో పంట పొలాలను వరదనీరు ముంచేసింది. మంగళవారం గురండి గ్రామస్తులు అప్రమత్తమై సీతా మహాలక్ష్మి చెరువు గట్టుకు గండి పడే ప్రమాదం ఉండడంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. జేసీబీతో చెరువుకు సప్లా తీయించి దిగువకు చెరువు నీరు వెళ్లేలా కాలువ తవ్వించి వరద నీరు పోయేలా ఏర్పాటు చేశారు. నేరడి రైతులు కూడా సహకరించారు.


గురండి చెరువుకు జేసీబీతో కాలువ తవ్విస్తున్న రైతులు

వాడీవేడిగా మండల సమావేశం

గంట్యాడ: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన వాడీవేడిగా జరిగింది. దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎంపీడీవోను ప్రశ్నించారు. వ్యవసాయం, విద్యుత్, వైద్యం, విద్య, ఉపాధి హామీ, ఐసీడీఎస్, పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలపై సమీక్షించారు. మండలంలో పెణసాం, నీలావతి గ్రామాలకు యూరియా సరఫరా చేయాల్సి ఉందని, ఏవో తెలపగా దీనిపై ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ అన్ని గ్రామాలకు సమానంగా యూరియా ఇవ్వాలని సూచించారు. పై రెండు గ్రామాలకు ఇప్పటి వరకు ఎందుకు యూరియా సరఫరా చేయలేదని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు చాలా మంది రైతులకు ఇప్పటికీ పడలేదని ఏవోకు ఫోన్ చేస్తే సమాచారం ఇవ్వడం లేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. పంచాయతీల్లో నిధుల్లేకుండా ఎలా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టగలమని పెదవేమలి సర్పంచ్ పాపునాయుడు ప్రశ్నించారు. దివ్యాంగ పింఛన్లు 100 శాతం, 70 శాతం సదరం శాశ్వత సర్టిఫికెట్లు ఉన్నా ఇప్పుడు 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నట్టు రీవెరిఫికేషన్ వైద్యులు నిర్ధారించి పింఛన్లు తొలగిస్తున్నారని ఇది ఎంత వరకు సమంజసమని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గట్టిగా నిలదీశారు. తల్లికి వందనం ఎంత మందికి ఇంకా రాలేదని ఎంఈవోను ఎమ్మెల్సీ సురేష్‌బాబు ప్రశ్నించారు. రామవరం గ్రామంలో 2023లో 17 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇచ్చారని, స్థలాలు అప్పగించాలని ప్రతి సమావేశంలో అడుగుతున్నా.. ఎందుకు స్థలాలు అప్పగించడం లేదని ఎంపీపీ హైమావతి తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డిని ప్రశ్నించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడాలని సూచించారు. 18 నెలలుగా ఎంపీటీసీలకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు జిల్లా పరిషత్ నిధుల నుంచి జీతాలు ఇప్పించడానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అంగీకరించారని చెప్పారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

ఘనంగా ప్రారంభమైన శతచండీ రుద్ర మహా యాగం


పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కర్మాగార ఎండీ దంపతులు

లక్కవరపుకోట : మండలంలోని శ్రీరాంపురం గ్రామం సమీపంలో గల స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారం ఆవరణలో యాజమాన్యం ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం చేపట్టిన శ్రీ లక్ష్మీగణపతి సహిత శతచండీ రుద్ర మహా యాగం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు, పరిసర గ్రామాల ప్రజలు ఆయురారోగ్యలతో ఉండాలని ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్టు కర్మాగార మేనేజింగ్ డైరెక్టర్ బండి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ యాగాన్ని ప్రధాన పురోహితులు వాసు ఆచార్యులు, శ్రీధర్ ఆచార్యులు, సతీష్ ఆచార్యులతో పాటు 22 మంది ఋత్విక్‌లతో తొలి రోజు పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ యాగ పూజా కార్యక్రమాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు కర్మాగార ప్రతినిధులు తెలిపారు. పూజా కర్యక్రమంలో ఎండీ బండి సురేష్‌కుమార్ ఆయన సతీమణి పద్మ చేతుల మీదగా పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో కర్మాగార ఎండీలు బండి సతీష్‌కుమార్, రమేష్‌కుమార్‌లతో పాటూ కర్మాగార ప్రతినిధులు పి.బాలకృష్ణ, కృష్ణారావు, మల్లివీడు సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున, పినిశెట్టి కిష్టప్పదొర తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

జామి: మండలంలోని అన్నంరాజుపేట పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నింటి అప్పలరాజును నియమించడంతో మంగళవారం ఏఆర్ పేట పీఏసీఎస్‌లో అతను ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ బాధ్యతతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సెక్రటరీ గురువులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీలో ప్రవేశాలు

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.కేశవరావు చెప్పారు. కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్‌లు డిజిటల్ లైబ్రరీలు ఉన్నాయన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరైతే ఉచితంగా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. బీఏలో పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, బీకాం జనరల్, బీఎస్సీ కెమిస్ట్రీ, మ్యాథ్‌మెటిక్స్ కోర్సులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు హాస్టల్ వసతి అందుబాటులో ఉందన్నారు.

నీరు నిల్వ లేకుండా చర్యలు

చీపురుపల్లి రూరల్: చీపురుపల్లి పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి అనుకొని ఉన్న కాలువలలో పూడికలు తీసి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ రాము మంగళవారం తెలిపారు. పంచాయతీ కాలువలలో అక్రమ కట్టడాలను తొలగించి పూడికలు తొలగించారు. కాలువలపై అక్రమ కట్టడాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోజూ క్లోరినేషన్ చేయించాలి

చీపురుపల్లి రూరల్: గ్రామాల్లో ప్రతి రోజు వాటర్ ట్యాంక్‌ల వద్ద క్లోరినేషన్ తప్పనిసరిగా చేయించాలని డివిజనల్ జోనల్ ఇన్‌చార్జ్ హేమ సుందర్ సూచించారు. మండలంలోని కరకాంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ, సవిత్వ సర్వేను పరిశీలించారు. సచివాలయం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.


ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణను పరిశీలిస్తున్న హేమసుందర్

పింఛన్లు తొలగించడం తగదు

దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వ హయాంలో అర్హులైన వారి పింఛన్లు తొలగించి పేదల పొట్ట కొట్టడం తగదని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు పేర్కొన్నారు. తన చాంబర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులకు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్ నగదుతో వారు జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు. సదరం వెరిఫికేషన్ పేరిట ఆసుపత్రుల చుట్టూ తిప్పుతూ అర్హుల పింఛన్లు తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మండల వ్యాప్తంగా 35 గ్రామ పంచాయతీల్లో సుమారు 120కి పైగా పింఛన్లు తొలగించడంతో లబ్ధిదారులు గందరగోళానికి గురై కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. వెంటనే పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు

ఘనంగా వేణుగోపాలస్వామి పవిత్రోత్సవాలు

జామి: అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో విశ్వక్సేన ఆరాధన, యాగద్రవ్య ఆలయ ప్రదక్షణలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నెల 22 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు.


పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

దెప్పూరులో రెవెన్యూ అధికారుల విచారణ

శృంగవరపుకోట : మండలంలోని దెప్పూరు గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్, ఆర్.ఐ, వీఆర్వోలతో కలిసి మంగళవారం విచారణ నిర్వహించారు. దెప్పూరు గ్రామంలో భూములను గ్రామస్తులకు తెలియకుండా, వారికి చెప్పకుండా , కనీస సమాచారం లేకుండా జిందాల్‌కు రిజిస్ట్రేషన్ చేశామని ఊర్లు ఖాళీ చేయాలని చెప్పటంతో ఇటీవల దెప్పూరు గ్రామస్తులు కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భూమి జిందాల్‌కు ఇస్తే ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో ఇళ్లు ఎలా మంజూరు చేశారు.. ప్రభుత్వ పథకాలు ఎలా మంజూరు చేశారంటూ అధికారులను అడిగారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా సర్వే నంబరు 146/4పై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించినట్టు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు పరిశీలన చేశామని, తమ నివేదికను కలెక్టర్‌కు పంపుతామని చెప్పారు.


దెప్పూరులో విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

సచివాలయంలో రికార్డుల పరిశీలన

బొండపల్లి: మండల కేంద్రమైన బొండపల్లి సచివాలయంలో అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను డీఎల్‌పీవో ఆర్.శిరీషా రాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 2021 – 2025 సంవత్సరాల వరకు చేపట్టిన అభివృద్ధి పనులు రికార్డులతో పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఆర్.రఘుపతిరావు, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, సంతోష్ పాల్గొన్నారు.


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ముంపులోనే వరి పంట


వేపాడలో ముంపుకు గురై నీటిలో వున్న వరి పంట

వేపాడ: మండలంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వరి పంట పొలాలు మంగళవారం ముంపుతోనే వున్నాయి. వేపాడ రెవెన్యూ పరిధిలో తోము చెరువు ఆయకట్టు పరిధిలో పంట పొలాలు ముంపులోనే వున్నాయి. మారిక కొండ గెడ్డ నుంచి నీరు వస్తుండటంతో మూడు రోజులైనా ముంపు తగ్గలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి దుబ్బు కుళ్లిపోయే ప్రమాదం వుందని చెబుతున్నారు.

వరద నీటి ప్రభావంతో అవస్థలు

లక్కవరపుకోట : తుఫాన్ ప్రభావం వీడినా వరద నీటిలోనే పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ హోమియో పతిక్ వైద్యశాల, సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం తదితర కార్యాలయాలు ఇంకా వరద నీటిలో ఉన్నాయి. దీంతో ఎస్సీ బాలుర వసతిగృహం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మోకాలు లోతు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో బాధపడుతున్నారు.


వరద నీటిలో ఎస్సీ బాలుర వసతిగృహం